## క్లుప్తంగా

### నేడు అమ్మవారికి ప్రత్యేక పూజలు


రాజరాజేశ్వరి మాత

సాక్షి,పాడేరు: పట్టణంలోని పురాతన ఉమానీలకంఠేశ్వర స్వామి సహిత రాజరాజేశ్వరిమాత ఆలయంలో సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు భక్తులకు ఉచిత ప్రసాద వితరణ కార్యక్రమం చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కాశీ అన్నపూర్ణేశ్వరి అమ్మవారి అన్న ప్రసాద కార్యక్రమంగా నామకరణం చేశామన్నారు. భక్తుల సహకారంతో ప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

### కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు


రేఖపల్లిలో వ్యాపారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్

వీఆర్ పురం : వరదలను సాకుగా చెప్పి నిత్యావసర సరకుల విషయంలో కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ కిరాణా, కూరగాయల దుకాణదారులను హెచ్చరించారు. ఆదివారం రేఖపల్లి గ్రామంలోని పలు దుకాణాలను ఆయన తనిఖీ చేసి దుకాణదారులకు పలు సూచనలు చేశారు.

### అనారోగ్యంతో చిన్నారి మృతి

సీలేరు: దారకొండ పంచాయతీ కమ్మరితోట గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారి అనారోగ్యంతో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామానికి చెందిన రెడ్డి బాబూరావు, నీలిమ దంపతులకు మూడేళ్ల చిన్నారి ఉంది. చిన్నారికి శనివారం రాత్రి వాంతులు, విరోచనాలు అధికంగా కావడంతో ఆ సమయంలో భారీగా వర్షం కురుస్తుండడంతో ఆస్పత్రికి తీసుకెళ్లడం వీలు కాలేదని, ఆదివారం ఉదయం దారకొండ పీహెచ్‌సీకి తీసుకెళ్లగా మార్గమధ్యలో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

### సుజనకోటలో తాగునీటి సమస్య


బోరు నుంచి వస్తున్న కలుషిత నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: సుజనకోట పంచాయతీ కేంద్రంలో తాగునీటి సమస్యతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా తాగునీటి మోటార్లు పాడవడంతో నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. వర్షాకాలం కావడంతో బోరు బావి నుంచి ఊట రూపంలో వస్తున్న నీటినే పట్టుకొని వినియోగిస్తున్నామంటున్నారు. కలుషిత నీరు వినియోగం వల్ల రోగాలు ప్రబలే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

### ఆదివాసీల అభ్యున్నతికి కృషి

రంపచోడవరం: ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం సమావేశం రంపచోడవరంలో ఆదివారం జరిగింది. సంఘం సీనియర్ నాయకుడు కుర్సం ఫకీర్‌దొర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కత్తుల ఆదిరెడ్డి, సహాయక కార్యదర్శి తాడే రాంబాబు, జిల్లా కోశాధికారి కుంజం అగ్గిదొర, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంజం రాంబాబు, బొరగ గంగరాజు, విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ఎన్నుకునేందుకు ఆగస్టు 4న సమావేశమైందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతికి సంఘం తరఫున తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం సంఘం పనితీరుపై చర్చించారు. నూతన భవన నిర్మాణం, నిధుల సమీకరణ, భవన నిర్మాణ కమిటీ ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు.



# ఉద్యాన పంటలకు ఉపాధి ఊతం


పెదబయలు మండల పరిషత్ కార్యాలయంలో సిల్వర్ ఓక్ మొక్కలను రైతులకు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో, అధికారులు(ఫైల్)


సిల్వర్ ఓక్ మొక్కల గుంతలను పరిశీలిస్తున్న ఏపీవో, ఉపాధి సిబ్బంది

- మండలంలో 350 ఎకరాల్లో సిల్వర్ ఓక్ తోటల పెంపకం
- గత ఏడాది 667 ఎకరాల్లో జీడిమామిడి మొక్కల పంపిణీ
- సపోట, నిమ్మ, జీడిమామిడి మొక్కల పంపిణీకి చర్యలు

పెదబయలు: పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తి సరిగా లేక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దిగుబడులు తగ్గడంతో మార్కెట్లో డిమాండ్ పెరుగుతోంది. ఏజెన్సీలో వరి, సిరిధాన్యాల సాగుకు ప్రత్యామ్నాయంగా పండ్లు, ఉద్యాన తోటల సాగు విస్తారంగా చేపడుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గిరిజన రైతులు ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తూ తమ పట్టా భూముల్లో సిల్వర్ ఓక్, జీడిమామిడి, నిమ్మ, సపోట తదితర ఉద్యాన పంటల పెంపకం చేస్తున్నారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏటా రైతులు ఆసక్తి మేరకు వారికి కావలసిన మొక్కల పంపిణీ జరుగుతుంది.

**మొక్కల పంపిణీ**

ఇందులో భాగంగా పెదబయలు మండలంలో 352 ఎకరాల్లో 2024 సంవత్సరంలో 2,46,400 లక్షల సిల్వర్ ఓక్ మొక్కలు పంపిణీ చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మండలంలోని సీతగుంట గ్రామ పంచాయతీ పరిధిలో రైతులకు 4200 మొక్కలను అందజేశారు. ఈ ఏడాది పెదబయలు మండలంలో అత్యధికంగా కుంతుర్ల పంచాయతీలో-54 ఎకరాలు, పెదకోడాపల్లిలో- 50 ఎకరాలు, కిముడుపల్లిలో-24 ఎకరాలు అలాగే 23 గ్రామ పంచాయతీ పరిధిలో 15 నుంచి 20 ఎకరాల వరకు రైతులకు పంపిణీ చేశారు. ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు రైతులకు నాణ్యమైన మొక్కల పంపిణీ జరుగుతోంది. మండలంలో జీడిమామిడి-6 ఎకరాలు, సపోట-6 ఎకరాలు, నిమ్మ-3 ఎకరాల చొప్పున రైతుల అవసరాల ఆధారంగా మొక్కల పంపిణీ జరుగుతుంది.

**అంతర పంటల సాగు**

మండలంలో సిల్వర్ ఓక్ మొక్కల పెంపకానికి గిరిజన రైతులు ఆశక్తి చూపిస్తున్నారు. మూడేళ్ల వరకు ఉపాధి పథకంలో మొక్కల పెంపకానికి రైతులకు ప్రోత్సాహక నిధులు అందించడంతో పాటుగా దీనికి అంతర పంటలు ముఖ్యంగా సిల్వర్ కింద కాఫీ, మిరియాలు, పైనాపిల్ సాగుకు ఇక్కడ వాతావరణం అనువుగా ఉండడంతో రైతులు సాగుకు ముందుకు వస్తున్నారు. గతంలో కంటే రైతుల్లో అవగాహన పెంచుకోవడంతో ప్రతీ గ్రామంలో సిల్వర్ ఓక్ మొక్కల పెంపకంతో పాటు కాఫీ, మిరియాలు పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా చేస్తున్న పంటల్లో సిల్వర్ ఓక్ పంటకు మంచి గుర్తింపు పొందింది.

**అనుకూలంగా వాతావరణం**

సిల్వర్ ఓక్ మొక్కలు నాటడానికి ఇదే ప్రస్తుతం వాతావరణం అనుకూలమని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు. ఈ మేరకు 45 రోజుల నుంచి 30 రోజుల ముందుగానే గుంతలు తీసుకోవాలని, గుంత 0.45 మీటర్లు లోతు,పొడవు,వెడల్పు సమానంగా ఉండాలని, మొక్క మొక్కకు మధ్య దూరం 2 మీటర్లు ఉండాలని,నాటేటప్పుడు గుంతల్లో గామేషన్ వేసుకోవాలి,నాటే ప్రదేశంలో పూర్తిగా దున్నుకుని నాటు కుంటే మంచిది. జూలై, ఆగస్టు నెలలు ఎంతో అనుకూలంగా ఉంటుంది.

**సిల్వర్ ఓక్ మొక్కల పెంపకంపై ఆసక్తి**



మండలంలోని రైతులు సిల్వర్ ఓక్ మొక్కల పెంపకానికే ఆసక్తి చూపిస్తున్నారు. గతేడాది ఎక్కువగా జీడిమామిడి పెంపకం చేపట్టారు. ఈ ఏడాది రైతులు సిల్వర్ ఓక్ పెంపకంపై దృష్టి సారించారు. మండలంలో 352 ఎకరాల్లో మొక్కల పంపిణీకి శ్రీకారం చుట్టాం. మూడేళ్ల వరకు రైతుకు ప్రోత్సాహకం అందుతుంది. అంతర పంటలుగా కాఫీ, మిరియాలు, పైనాపిల్ సాగు చేసుకోవచ్చు. సపోట, నిమ్మ, జీడి మామిడి తోటలు సాగు చేసుకోవచ్చు.

– పి.చిన అప్పలనాయుడు, ఏపీవో, పెదబయలు మండలం

## గర్భిణుల వైద్య సేవలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు


మాట్లాడుతున్న ఎంపీపీ అనూషాదేవి,పక్కన జెడ్పీటీసీ బాలయ్య , ఎంపీడీవో, తహసీల్దార్

- ఎంపీపీ అనూషాదేవి

చింతపల్లి(సాక్షి,పాడేరు): గర్భిణుల వైద్యసేవలపై ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని, వెంటనే చింతపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రానికి గైనికాలిజిస్టు వైద్యులను నియమించాలని ఎంపీపీ కోరాబు అనూషాదేవి డిమాండ్ చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు, తాగునీరు, వైద్యం, పారిశుధ్య సమస్యలు, ఇంజినీరింగ్ పనులపై చర్చించారు. జల్‌జీవన్ మిషన్ పనులు సక్రమంగా జరగడం లేదని, ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని, చింతపల్లి, తాజంగి వంటి ప్రధాన గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎంపీపీ అనూషాదేవి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు గిరిజనాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలన్నారు. చింతపల్లి ఆస్పత్రిలో గర్భిణులకు వైద్యపరీక్షలు, కాన్పులకు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వంతో పాటు వైద్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించడం అన్యాయమన్నారు. ఇక్కడ గైనిక్ వైద్యులు పాడేరు జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్నారని, వారిని వెంటనే చింతపల్లి ఆస్పత్రిలో నియమించాలని ఆమె డిమాండ్ చేశారు.అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారుల పనితీరు మెరుగుపరుచుకోవాలని, జల్‌జీవన్ మిషన్ పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం సమంజసం కాదన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ నామినేటెడ్ ఇంజినీరింగ్ పనులన్ని ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగిస్తుండడంతో పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. అభివృద్ధి పనుల వేగవంతం లక్ష్యంతో అన్నిశాఖల ఇంజనీరింగ్ అధికారులు పనిచేయాలన్నారు. చింతపల్లి ఆస్పత్రిలో పిల్లల బర్త్ సర్టిఫికెట్లకు లంచం వసూలు చేసిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లోతుగెడ్డ సర్పంచ్ సునీల్ మండల పరిషత్ పాలకవర్గాన్ని కోరారు. వైస్ ఎంపీపీలు గోపినాయక్ శారద, సాగిన వెంగళరావు, ఎంపీడీవో వీరసాయిబాబు, తహసీల్దార్ టి.రామకృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

### హామీల అమలులో ప్రభుత్వం విఫలం


బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు

అరకులోయ రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గెడ్డం నర్సింగరావు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతు ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అర్హులైన ప్రజలకు అందించడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. అధికారం కోసం ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు హామీలు కురిపించి నేడు మోసం చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు సక్రమంగా, సకాలంలో అందించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు కావస్తున్నా నేటికీ ఒక్క పథకం అమలు చేయకుండా కక్ష రాజకీయాలకు తెరలేపుతుందన్నారు. ఇప్పటికే ప్రజా వ్యతిరేకత మొదలైందని భవిషత్‌లో కూటమి ప్రభుత్వంపై ప్రజాగ్రహణం తప్పదన్నారు.

# కూలిన ఇళ్లు.. కోతకు గురైన కల్వర్టులు


సుజనపేట వద్ద కుంగిన కల్వర్టును పరిశీలిస్తున్న సర్పంచ్ రమేష్


లబ్బర్తి వెళ్లే ప్రధాన రహదారిపై దెబ్బతిన్న కల్వర్టు


వంట్రంగిపాడు గ్రామంలో వర్షానికి కూలిన ఇంటి గోడ

ముంచంగిపుట్టు: జిల్లాలో కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాలన్నీ నీట మునిగాయి. వర్షాలు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. రాకపోకలు నిలిచిపోయాయి. ఇళ్లు నేల మట్టమయ్యాయి.. కల్వర్టులు, రహదారులు కోతకు గురయ్యాయి. వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

ముంచంగిపుట్టు మండలంలోని సుజనకోట పంచాయతీ సుజనపేట గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ మార్గంలో మత్తుతమ్మ గుడి వద్ద వరదనీరు ఉధృతికి కల్వర్టు కుంగిపోయింది. దీంతో అటుగా రాకపోకలు చేసే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రహదారిపై కల్వర్టు సగభాగం పూర్తిగా ధ్వంసం అవడంతో ప్రమాదకరంగా మారింది. కల్వర్టు కుంగిపోయిన విషయం తెలుసుకున్న సర్పంచ్ వి.రమేష్ వచ్చి పాడైన కల్వర్టును పరిశీలించారు. ఫోన్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులకు సమాచారం అందించారు. కుంగిన కల్వర్టును బాగుచేయాలని, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన కోరారు. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు సోమవారం వచ్చి కల్వర్టు బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వాహనచోదకులు జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణాలు చేయాలని సర్పంచ్ రమేష్ కోరుతూ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

జి.మాడుగుల: మండలంలో పెదలువ్వాసింగి, భీరం పంచాయతీల్లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వంట్రంగిపాడు గ్రామానికి చెందిన కింతర్ల చిన్నబ్బాయికు చెందిన ఇంటి గోడ కూలిపోయింది. భీరం గ్రామానికి చెందిన ఒలేసు జనపమోహన్ ఇళ్లు దెబ్బతింది.దీంతో ఆయా కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. నష్టపరిహారం అందించి ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేయాలని బాధితులు కోరారు.

రాజవొమ్మంగి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లబ్బర్తి వద్ద ప్రధాన రహదారికి వాలుగా చిన్నేరుపై నిర్మించిన కల్వర్టు ఆదివారం దెబ్బతింది. దాదాపు పది గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు ఇబ్బంది తలెత్తింది. నిత్యం పొంగి ప్రవహించే ఈ వాగుపై గల కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరుగకుండా చూడాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

## గ్రామాల్లో జోరుగా పారిశుధ్య పనులు


రేగడిపాలెంలో పారిశుధ్య పనులు

వై.రామవరం: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఎంపీడీవో కె.బాపన్నదొర పర్యవేక్షణలో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలు, డ్రైనేజీల్లో పారిశుధ్య పనులు చేశారు. ఇందులో భాగంగా ఆదివారం కె.యర్రగొండ సచివాలయం పరిధిలోని రేగడి పాలెం గ్రామంలో శానిటేషన్ పనులు చేపట్టారు. నీరు నిల్వ ఉన్న ప్రతీ చోట యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా ఆయిల్‌బాల్స్ వేశారు. బ్లీచింగ్ చల్లారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఎంపీడీవో బాపన్నదొర సూచించారు. సర్పంచ్ వెదుళ్ల సత్యనారాయణ రెడ్డి, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రమాదకరంగా కల్వర్టు


రాకాసిరాయి వద్ద కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు కింద భాగం

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి కుమడ వెళ్లే మార్గంలో రాకాసిరాయి గ్రామం సమీపంలో ఉన్న కల్వర్టు కింద భాగం ఆదివారం కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అటుగా రాకపోకలు చేసే వాహనదారులు భయపడుతూ ప్రయాణం చేయాల్సిన వస్తోంది. ఎప్పుడూ కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పంచాయతీ రాజ్ అధికారులు కోతకు గురైన కల్వర్టు కింద భాగాన్ని మరమ్మతులు చేసి, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వాహనచోదకులు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎంపీడీవో కిరణ్‌కుమార్, పీఆర్ ఏఈ మురళీకృష్ణ మాట్లాడుతూ రాకాసిరాయి వద్ద నూతన కల్వర్టు నిర్మాణం కోసం రూ.12 లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించనట్టు తెలిపారు. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తామని వారు తెలిపారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు


రేఖపల్లిలో వరద బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

వీఆర్ పురం: మండలాన్ని వరద నీరు చుట్టుముట్టడంతో గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రభలకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకున్నట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ నోడల్ ఆఫీసర్ ఎస్.ప్రశాంత్ కుమార్ చెప్పారు. మండలంలోని వడ్డిగూడెం, డీటీ గూడెంతో పాటు రేఖపల్లిలోని పునరావాస కేంద్రాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు నిత్యాసర సరకులు, బియ్యం తదితర సామగ్రి పంపిణీ చేశామన్నారు. పునరావాస కేంద్రాల్లోని వరద బాధితులతో ఆయన మాట్లాడి అందుతున్న సహాయ కార్యక్రమాలపై ఆరా తీశారు. తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపీడీవో ఆర్.ఫణేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి


గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వైస్ సర్పంచ్ భగత్‌రాం

అరకులోయ రూరల్: గ్రామల్లో ప్రధాన సమస్యలను పరిష్కరించాలని వైస్ సర్పంచ్ జన్ని భగత్‌రాం తెలిపారు. మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న దుమగుడ, సారథ బొందుగుడ, తదితర గ్రామాల్లో సీపీఎం నాయకులతో ఆదివారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్క గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని, వీధి దీపాలు ఏర్పాటుచేయాలన్నారు. అధికారులు చొరవతీసుకొని గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు మూగజీవాల మృత్యువాత


రంగినిగూడలో వర్షానికి మృతి చెందిన ఆవులు


జర్జులలో మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు


కించూరులో మృతి చెందిన ఆవు

ముంచంగిపుట్టు: మండలంలో పలు గ్రామాల్లో వర్షాలకు మూగజీవాలు మృతి చెందాయి. దీంతో గిరిజన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జర్జుల పంచాయతీ కేంద్రంలో ఎం.కొండబాబుకు చెందిన ఆవు, కె.లోకనాథ్‌కు చెందిన రెండు దుక్కిటెద్దులు, బుంగాపుట్టు పంచాయతీ రంగినిగూడ గ్రామానికి చెందిన కె.కొమ్ములైబోన్‌కు చెందిన ఆవు, లక్ష్మీపురం పంచాయతీ జబడ గ్రామానికి చెందిన కె.ధనుర్జయ్‌కు చెందిన దుక్కిటెద్దు వర్షానికి అనారోగ్యం పాలై మృతి చెందాయి. వాటి విలువ రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని, వ్యవసాయానికి ఉపయోగపడే సమయంలో ఇలా మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు. మూగజీవుల మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు ఆయా గ్రామాలకు వెళ్లి మృతి చెందిన పశువులను పరిశీలించారు. ప్రతి ఒక్క రైతుకు నష్టపరిహారం అందేలా అధికారులు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని, న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు.

పెదబయలు: మండలంలోని గుల్లేలు పంచాయతీ కించూరు గ్రామంలో వారం రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు ఆరు దుక్కిటెద్దులు మృతి చెందాయి. గ్రామంలోని పాడి రైతులు బూడిదే రమేష్‌కు చెందిన ఆవు, సాగేని పండన్నకు చెందిన రెండు ఎద్దులు, సాగేని పెంటన్నకు చెందిన రెండు ఎద్దులు, సాగేని బాలన్నకు చెందిన రెండు ఎద్దులు, బూడిదె రాములమ్మకు చెందిన ఒక ఆవు, బూడిదె బుల్లమ్మలకు చెందిన రెండు ఆవులు మృతి చెందాయి.

ప్రభుత్వం ఆదుకొని తమకు పరిహారం అందజేయాలని ఆయా బాధిత రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా గ్రామంలోని పశువులు, గొర్రెలు, మేకల కాళ్ల డెక్కలకు పుండ్లు ఏర్పడి నడవడం కష్టంగా మారిందని పలువురు రైతులు తెలిపారు. గ్రామంలో పశువులు జబ్బులతో ఉన్నాయని అధికారులు స్పందించి పశువైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

## నూతన భవనం మంజూరు చేయాలని ఆందోళన



జోలాపుట్టులో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయితీ కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా కొనసాగుతున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవనం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.కార్తీక్ శ్రీను మాట్లాడుతూ వసతి భవనాలు 50 ఏళ్ల క్రితం నిర్మించడంతో ఎప్పుడూ కూలిపోతాయేననే భయంతో నిత్యం విద్యార్థులు భయం భయంతో ఉంటున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నూతన భవనాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్‌లను నియమించాలని, కాస్మోటిక్ చార్జీలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పురిస్తన్, కమిటీ సభ్యుడు కామేష్ తదితరులు పాల్గొన్నారు.

### స్నేహితుల ఔదార్యం


సింహాచలం కుటుంబానికి నిత్యావసరాలు, నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

పెదబయలు: తమతో చదువుకున్న చిన్ననాటి మిత్రుడు కష్టాల్లో ఉన్నట్టు తెలుసుకుని వారి గ్రామానికి వెళ్లి ఆర్థిక సహాయం చేసి వారి కుటుంబాన్ని అండగా నిలిచారు. మండలంలోని మారుమూల కుంతుర్ల పంచాయతీ బర్రెమామిడి గ్రామానికి చెందిన కించేయి సింహాచలం ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాక్షికంగా దెబ్బతింది. అయితే ఈ విషయం పత్రికల్లో, పలు సోషల్ మీడియాల్లో చూసి పెదబయలులో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కించేయి సింహాచలం చిన్ననాటి స్నేహితులు ఆదివారం బర్రెమామిడి గ్రామానికి వెళ్లారు. స్నేహితుడు సింహాచలం కుటుంబానికి నిత్యావసర సరుకులు, కొంత నగదును అందించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, బాలకృష్ణ, విశ్వనాథం, బాలయ్య తదితరులు న్నారు. స్నేహితుల ఔదార్యంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.